సాక్షి
జనగామ
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



జేఎన్‌ఎస్‌లో క్రీడాపండుగ

హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. - 10లో▸



రైల్వే కోచ్‌ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్

కాజీపేట రైల్వే కోచెస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$32^0 / 24^0$

వాతావరణం

ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జనగామ ఏసీపీ పార్థసారధి



బచ్చన్నపేట : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు వస్తే స్పందించకూడదని జనగామ ఏసీపీ పార్థసారధి అన్నారు. సోమవారం పోచన్నపేటలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి పలు వాహనాలను, బెల్టు షాపులను తనిఖీ చేశారు. బీర్లు, గుట్కా ప్యాకెట్లు, సరైన పత్రాలు లేని 23 ద్విచక్రవాహనాలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా లాంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సైలు ఎస్‌కే.హమీద్, నగేష్, శ్వేత, మధు, రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'భూమాత' చట్టంతో ప్రజలకు న్యాయం



బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 'భూమాత' చట్టంతో ప్రజలకు న్యాయం జరుగుతుందని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ అన్నారు. సోమవారం స్థానిక రైతులతో ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై నిర్వహిస్తున్న ప్రజాయాత్ర బచ్చన్నపేటకు చేరుకుందని చెప్పారు. గాంధీ జయంతి రోజున ప్రారంభమైన ఈ యాత్ర ఈనెల 14న చేవెళ్లలో ముగుస్తుందని పేర్కొన్నారు. భూసమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వారి ఇబ్బందులపై సమగ్ర అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

మారుమూల ప్రాంతాలకు 'హైడ్రా' విస్తరించాలి



జనగామ: మారుమూల ప్రాంతాలకు సైతం 'హైడ్రా' మిషన్ విస్తరించాలని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే హైదరాబాద్‌లో రహదారులను వరద ముంచెత్తుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. చెరువులు, నాలాలను కబ్జా చేయడంతోనే ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ విపత్కర సమయంలో 'హైడ్రా' తీసుకువచ్చి అక్రమ కట్టడాలను తొలగించడం హర్షించ దగిన విషయమని పేర్కొన్నారు. 'హైడ్రా' మిషన్‌ను హైదరాబాద్‌తో పాటు జిల్లాలు, మండలాలు, గ్రామాలకు విస్తరించాలని కోరారు.

ఫిల్టర్ బెడ్ నిర్వహణ అధ్వానం..

పరిశీలించిన అధికార పార్టీ కౌన్సిలర్లు



జనగామ: జనగామ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే చీటకోడూరు ఫిల్టర్ బెడ్ నిర్వహణ అధ్వానంగా మారిందని కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్, 9వ వార్డు కౌన్సిలర్ ముస్త్యాల చందర్ అన్నారు. సోమవారం వారు ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నీటిని ఫిల్టర్ చేసే విధానంలో నాణ్యతాప్రమాణాలపై అనుమానాలున్నాయని, అందులో వినియోగించే పదార్థాల విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తున్నదని చెప్పారు. తాగునీరు పేరిట సరఫరా చేస్తున్న నీటిని ఎవరూ తాగడం లేదని, పరిశీలిస్తే నిత్యావసరాలకు కూడా పనికి రాకుండా ఉందన్నారు. ఆ నీటిని వినియోగిస్తే ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కమిషనర్, ఇతర అధికారులు ఉన్నా పురపాలిక పరిస్థితి అధ్వానంగా మారిందని విమర్శించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయని పక్షంలో అధికారులు జవాబు చెప్పుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

'ఉపాధి'కి ప్రణాళికలు

- సిద్ధమవుతున్న కార్యాచరణ
- ఇప్పటికే గ్రామ సభలకు శ్రీకారం
- గ్రామస్తుల అనుమతితో పనుల గుర్తింపు
- నెలాఖరులోగా పూర్తి కానున్న ప్రక్రియ



శామీర్‌పేట గ్రామంలో పనులు చేపట్టే ప్రదేశంలో ఉపాధి కూలీలు(ఫైల్)

జనగామ రూరల్: ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రణాళిక రూపకల్పనకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామసభలు నిర్వహించి ప్రజల సమ్మతంతో పనులను గుర్తిస్తున్నారు. ఈనెల 2న ప్రారంభమైన ఈ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. నవంబర్ చివరి నాటికి పనుల లక్ష్యం నిర్ధారించనున్నారు.

పనుల ప్రాధాన్యత.. గుర్తింపు

ఉపాధి హామీ పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వనమహోత్సవం, పల్లె క్రీడామైదానాలు వంటి పనులతోపాటు చెరువులు, కుంటల్లో పూడికతీత, కట్టుకాల్వల నిర్మాణం చేపట్టనున్నారు. ఈసారి భూగర్భజలాలు పెంచేలా నీటి నిల్వ గుంతలు, పంట కాల్వలు, మట్టి దారులు, కందకాల తవ్వకాలు, పశువుల పాకల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో 2025–26లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. జిల్లా పరిధి 283 గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోపు గ్రామసభలు పూర్తి చేసి, నవంబర్‌లో మండలాల వారీగా పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి ప్రతిపాదిస్తారు.

వంద రోజులు పని కల్పించేలా..

పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందులో భాగంగా ముందు గ్రామాలకు అవసరమైన పనులు గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో పనులకయ్యే ఖర్చు వివరాలు తయారుచేసి తీర్మానాలను ఉపాధిహామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంది.

ఉపాధి పనుల వివరాలు

జిల్లాలో జాబ్ కార్డులు :	1,17,749
మొత్తం కూలీల సంఖ్య :	2,31,789
2024–25లో పని దినాల లక్ష్యం :	27.52 లక్షలు
పూర్తయిన పనిదినాలు :	26.32 లక్షలు
వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలు :	627
కూలీలకు చెల్లించిన డబ్బులు :	రూ.62.04 కోట్లు

గ్రామం యూనిట్‌గా నిర్వహణ

అడిగిన వారికి పని కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిర్వహణ ఇక నుంచి గ్రామం యూనిట్‌గా చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఉపాధి పనులు జిల్లా యూనిట్‌గా తీసుకుని నిర్వహిస్తుండగా.. ఒక గ్రామంలో పనులు ఎక్కువ.. మరో గ్రామంలో తక్కువ జరుగుతున్నాయి. పథకం ఉద్దేశం ప్రకారం పని అడిగిన 14 రోజుల్లోగా కల్పించాల్సి ఉంది. అయితే ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో వివరాలు నమోదయితే పని కల్పించాల్సిందే. లేదంటే నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంటుంది. కూలీ నుంచి డిమాండ్ తీసుకున్న అధికారి సకాలంలో పని కల్పించకపోతే ప్రభుత్వం జరిమానా విధిస్తుంది. ఇలా వసూలు చేసిన జరిమానా నుంచి కూలీలకు భృతి చెల్లిస్తారు.

సహజ వనరులకు ప్రాధాన్యం



ఉపాధిహామీ పథకం కింద వచ్చే ఏడాది చేపట్టే పనుల్లో సహజ వనరులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి సంరక్షణ పనులకు మొదటి ప్రాధాన్యత, వ్యవసాయ అనుబంధ, మొక్కల పెంపకం, పశువుల కొట్టాల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, కోళ్ల ఫారాల ఏర్పాటు పనులు కల్పించాలి. వీటిని గుర్తించేందు కు గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించాం.

– వసంత, డీఆర్‌డీఓ

శ్రీమహాలక్ష్మిగా అలంకరణ




శ్రీమహాలక్ష్మిగా ఉప్పలమ్మ అలంకరణ, గిర్నిగడ్డలో దుర్గామాత విగ్రహం వద్ద భక్తులు

జనగామ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని శ్రీ ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిగా అలంకరించారు. ప్రధాన పూజారి వారణాసి పవన్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, చిన్న వంశీకృష్ణ, శ్రీరాంరెడ్డి, ఓరిగంట శ్రీనివాస్, గట్టు దామోదర్, శోభ, అనంతరెడ్డి, మార్గం రవి, ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే గిర్నిగడ్డ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని శ్రీ మహాచండీదేవిగా అలంకరించారు. జై శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యాన కుంకుమార్చన నిర్వహించారు. శివరాజ్‌యాదవ్, రమేష్, సందీప్, అరుణ్, సంతోష్, నారం శ్రీధర్, వినయ్ కృష్ణ, మచ్చ రాజు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్, జఫర్‌గఢ్ పెద్ద చెరువులో సోమవారం వారు చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో మత్స్యకారులకు చేపల పంపిణీతో పాటు మత్స్యసొసైటీలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నదన్నారు. జఫర్‌గఢ్ పెద్ద చెరువును త్వరలో ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా మార్చనున్నట్లు పేర్కొన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ పాఠశాల మంజూరు కాబోతోందని, దీనిని జఫర్‌గఢ్ మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని ఎంపీ కావ్య ఎద్దేవా చేశారు. పదేళ్ల అధికారంలో ఉండి అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. డీఎఫ్ఓ రాణాప్రతాప్, ఆర్‌డీఓ వెంకన్న, ఘన్‌పూర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నీల రాజు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్ పెద్దచెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎల్‌బీ.స్టేడియంలో డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్న నేపథ్యంలో జిల్లా నుంచి 220 మంది అభ్యర్థులను ఉదయం 9 గంటలకు బస్సుల్లో తరలిస్తున్నట్లు చెప్పారు. అందరికీ ఐడీ కార్డులు, లైజనింగ్ అధికారుల నియామకం, భోజన వసతి, ఫ్లెక్సీ తదితర ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ప్రజావాణి, జిల్లా స్థాయిలో పెండింగ్ అర్జీలను వచ్చే వారంలోగా పరిష్కరించాలని సూచించారు. అలాగే మరో మూడు నెలల్లో ఈ–ఆఫీసు ఫైలింగ్ ప్రారంభం కానున్నందున ఆయా శాఖల జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీఓ కొమురయ్య, జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, డీఈఓ రాము, డీపీఓ స్వరూప, డీఏఓ రామారావు నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్

ఎంబీబీఎస్ సప్లిమెంటరీ పరీక్షలు


- నవంబర్ 5 నుంచి ప్రారంభం
- ఫస్టియర్‌లో 69 మంది అడ్మిషన్
- ఈనెల 16న ముగియనున్న ప్రక్రియ

జనగామ: ఎంబీబీఎస్ ఫస్టియర్ వార్షిక పరీక్షలు ముగియగా.. ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. జనగామ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులు 100 మంది(జాతీయ/రాష్ట్ర) పరీక్షలు రాయగా 88 మంది ఉత్తీర్ణత సాధించారు. నవంబర్ 5 నుంచి 18వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యాన ప్రత్యేక తరగతులు ప్రత్యక్షంగా.. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. సప్లిమెంటరీలో వందశాతం ఫలితాలు వచ్చేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.

ఫస్టియర్‌లో 69 మంది రిపోర్టు..

ఎంబీబీఎస్ ఫస్టియర్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. జనగామ మెడికల్ కళాశాలలో 100 సీట్లకు అనుమతి ఉండగా.. ఇందులో జాతీయ స్థాయి 15, రాష్ట్ర స్థాయి 85 శాతం కోటా కల్పించారు. ఫస్టియర్ విద్యార్థులు.. సెకండియర్‌లోకి అడుగు పెట్టగా తరగతులు కూడా మొదలయ్యాయి. ఇప్పటి వరకు అల్ ఇండియా లెవల్‌లో ఆయా రాష్ట్రాల నుంచి 11 మంది విద్యార్థులు రిపోర్టు చేయగా.. రాష్ట్ర స్థాయిలో(స్థానికత) 58 మంది అడ్మిషన్ తీసుకున్నారు. ఈనెల 16వ తేదీ వరకు అడ్మిషన్ చివరి గడువు ఉండడంతో ఇందులో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. కొత్తగా వచ్చే ఫస్టియర్ విద్యార్థులకు వసతి కోసం మరో హాస్టల్‌ను పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా ధర్మకంచ ఎస్సీ బాలికల వసతి గృహం పైఅంతస్తులోని విద్యార్థినుల హాస్టల్‌ను జనగామ మండలం పసరమడ్ల శివారు కోమటిరెడ్డి సుశీలమ్మ అనాథ వృద్ధాశ్రమంలోకి మార్చారు. ప్రస్తుతం నార్త్‌కు చెందిన 8 మంది విద్యార్థినులు ఉండగా, వారిని ఇందులోకి మార్చారు. వృద్ధాశ్రమంలో ఫస్టియర్, సెకండియర్‌కు చెందిన సుమారు 155 మంది విద్యార్థినులు ఉండబోతున్నారు. విద్యార్థినులకు భోజన వసతికి సంబంధించి పేరెంట్స్ కమిటీ నేతృత్వంలో నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ప్రిపరేషన్



నవంబర్ 5 నుంచి 18 వరకు జరిగే ఎంబీబీఎస్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షల కోసం విద్యార్థులకు ప్రిపరేషన్, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు కూడా కష్టపడి చదువుకోవాలి. ఫస్టియర్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు మూడుసార్లు మాత్రమే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గోపాల్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- గ్రీవెన్స్‌లో 44 అర్జీల స్వీకరణ

జనగామ రూరల్: అధికారులు ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన 44 అర్జీలను అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్‌తో కలిసి స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని తప్పనిసరిగా ప్రతి సోమవారం నిర్వహించాలని, అందుకు సంబంధించి విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులు పరిశీలించి మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జనగామ ఆర్డీఓ కొమురయ్య, జెడ్పీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి కె.రాము, డీఏఓ రామారావు నాయక్, డీపీఓ స్వరూప, డీఎంహెచ్‌ఓ రవీందర్‌గౌడ్, డీడబ్ల్యూఓ జయంతి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు

గ్రీవెన్స్ వచ్చిన సమస్యల్లో కొన్ని..

- రఘునాథపల్లి మండలం మేకలగట్టులో 198, 198/1, 206, 50, 51 సర్వే నంబర్లలోని తమ తల్లిదండ్రుల ఆస్తిని తమ్ముడు అక్రమంగా పట్టా చేసుకోజూస్తున్నాడని, రిజిస్ట్రేషన్ చేయకూడదని గ్రామానికి చెందిన కుమార్ కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నాడు.
- కొడకండ్ల మండలం రామన్నగూడెం సర్వే నంబర్ 703 బంజారకుంట కట్టపై గుడి నిర్మించారు.. దానిని తొలగించాలని గ్రామానికి చెందిన రవి, పాండు, శంకర్ దరఖాస్తు ఇచ్చారు.
- స్టేషన్‌ఘనపూర్ మండలం తాటికొండ 132 సర్వే నంబర్‌లోని తన భూమిని వేరే వ్యక్తులు పట్టా చేసుకున్నారని, భూమి ఇప్పించాలని గ్రామానికి చెందిన ఎ.రాజమ్మ అర్జీ పెట్టుకుంది.
- జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌లో ఇంటి నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నా.. జూన్ 14న పంచాయతీ కార్యదర్శి తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఎస్సైకి ఫిర్యాదు చేసి మూడు నెలలవుతున్నా విచారణ చేపట్టలేదని గ్రామానికి చెందిన బైరగోని కళావతి వినతిపత్రం అందజేశారు.
- బచ్చన్నపేట మండలం ఇటికాలపల్లి 220, 236 సర్వే నంబర్లలో మాన్యం భూమికి పట్టా, పాసు పుస్తకం ఇప్పించాలని గ్రామానికి చెందిన వై.కనకయ్య దరఖాస్తు చేసుకున్నారు.

ఖబ్రస్తాన్ భూమి పట్టా చేశారు



జనగామ మండలం సిద్దెంకిలోని పోచమ్మబండ పక్కనున్న ఖబ్రస్తాన్ భూమిలో ఆర్‌సీసీ భవనం ఉన్నట్టు పట్టా చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ.సర్వర్, బీరన్న, భిక్షపతి అర్జీ సమర్పించారు.

ఇటుకబట్టికని భూమిని ఆక్రమించారు..



152ఏ సర్వే నెంబర్‌లో ఒక ఎకరం 30 గుంటల భూమి మా అత్త మామలు సంపాదించారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లగా గ్రామానికి చెందిన వ్యక్తి ఇటుకబట్టి పెడతామని చెప్పి సంతకం చేయించుకున్నాడు. తర్వాత ఆన్‌లైన్‌లో అక్రమంగా పట్టా చేసుకున్నాడు. భూమి ఇవ్వమంటే ఇబ్బందులు పెడుతున్నాడు. న్యాయం చేయాలి.

– పయ్యావుల అయిలమ్మ, నవాబుపేట, లింగాలఘణపురం

బెదిరించి కేసులు పెట్టించారు..



గ్రామంలోని 147 సర్వే నంబర్‌లో 165 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. అందులో 39 గుంటల ప్రభుత్వ భూమి రికార్డులో ఉంది. మిగతా భూమిలో నుంచి కొంత గ్రామంలోని సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమ పత్రాలు సృష్టించి భూమి తమదని బెదిరించి కేసులు పెట్టించారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలి.

– బచ్చన్నపేట మండలం సాల్వాపూర్ రైతులు

జామాయిల్, నీలగిరి చెట్లు తొలగించాలి



కొన్నె గ్రామ పరిధి రామచంద్రగూడెంలో 60 ఎకరాల్లో జామాయిల్, నీలగిరి చెట్లు పెంచడంతో మా భూముల్లో సాగుకు నీటి ఎద్దడి ఏర్పడి ఇబ్బందులు పడుతున్నాం. రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. చెట్లను తొలగించాలి.

–బాల బల్లు, కొన్నె గ్రామం, బచ్చన్నపేట

మతోన్మాద విధానాలపై ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

జనగామ రూరల్: చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తితో బీజేపీ మతోన్మాద మహిళా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇర్రి అహల్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా మూడో మహాసభల్లో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన నాటి నుంచి మహిళా హక్కులను కాలరాయడంతోపాటు దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 33శాతం పెంచుతూ చట్టం చేసినా పదేళ్ల తర్వాత అమలు చేయాలనే ఆలోచన సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.షబానా, పందిళ్ల కళ్యాణి, మోకు భవాని, సీహెచ్ శ్రీలత, సౌందర్య, నిర్మల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో అభివాదం చేస్తున్న సంఘం బాధ్యులు అరుణజ్యోతి తదితరులు

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

జనగామ రూరల్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ, సీపీఎం, సీపీఐఎం లిబరేషన్ పార్టీల ఆధ్వర్యాన జనగామ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీ నాయకులు కనకారెడ్డి, రాజారెడ్డి, సాంబయ్య మాట్లాడుతూ.. అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తూ పౌరుల హక్కులను కాలరాస్తున్నదని అన్నారు. ఇలాంటి యుద్ధాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని పేర్కొన్నారు. భారత దేశం ఇజ్రాయెల్‌కు అండగా ఉండి శాంతిని నెలకొల్పాలని కోరారు. జోగు ప్రకాష్, సోమయ్య, సాయిలు, శ్రీశైలం, బాలరాజు, ఐలయ్య, రాజు, గోపి, రమేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులుంచొద్దు



కలెక్టరేట్ వద్ద ధర్నా సందర్భంగా నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు, సంఘం నాయకులు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు

జనగామరూరల్: గ్రామపంచాయతీ కార్మికులను పండుగ పూట పస్తులు ఉంచొద్దు.. తక్షణమే వారికి బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ – వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం జీపీ కార్మికులను పట్టించుకోకుండా వారితో వెట్టి చాకిరీ చేయించేలా మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం తెచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారోజు రామచంద్రం, బత్తిని వెంకన్న, బసవ రామచంద్రం, మల్లాచారి, మల్లేష్, జీడి ఆనందం, రతన్ సింగ్, యాకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరాకు నాగ్‌పూర్‌–బీదర్ ప్రత్యేక రైళ్లు

● కాజీపేట మీదుగా నడపనున్న అధికారులు

కాజీపేట రూరల్ : దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాజీపేట జంక్షన్ మీదుగా ఈ నెల 11వ తేదీ నుంచి నాగ్‌పూర్, బీదర్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

బీదర్–నాగ్‌పూర్–బీదర్ ప్రత్యేక రైళ్ల వివరాలు

ఈ నెల 11వ తేదీన బీదర్–నాగ్‌పూర్ (07023) ఎక్స్‌ప్రెస్ బీదర్‌లో 18.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12.00 గంటలకు నాగ్‌పూర్ చేరుతుంది. అదేవిధంగా ఈ నెల 13వ తేదీన నాగ్‌పూర్–బీదర్ (07024) ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్‌లో 20.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 11.00 గంటలకు బీదర్ చేరుతుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు జహీరాబాద్, మారపల్లి, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రాపూర్ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైల్వే బాక్స్ బాయ్‌ల తొలగింపునకు బ్రేక్

● సాక్షి కథనానికి స్పందించిన రైల్వే సంఘ్ నేతలు
● ట్రాలీ బ్యాగుల రద్దుకు అంగీకారం

సాక్షి స్పందన

కాజీపేట రూరల్ : రైల్వే బాక్స్‌బాయ్‌ల తొలగింపునకు బ్రేక్‌తో పాటు విధి నిర్వహణలో రైల్వే గార్డుల (ట్రైన్ మేనేజర్లు)కు డ్యూటీ ట్రాలీ బ్యాగుల పంపిణీ నిలిపివేతకు రైల్వే అధికారులు అంగీకరించినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు తెలిపారు. 'రైల్వే గార్డుల సేఫ్టీకి మంగళం' అనే శీర్షికన సెప్టెంబర్ 21వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈ కథనాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య దృష్టికి తీసుకెళ్లి వివరించినట్లు సోమవారం కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆపరేటింగ్ బ్రాంచీ సెక్రటరీ మహ్మద్ ముస్తాక్‌హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు రాఘవయ్య రైల్వే బోర్డు అధికారులు, దక్షిణ మధ్య రైల్వే సంబంధిత అధికారులతో మాట్లాడి బాక్స్ బాయ్‌ల తొలగింపు, రైల్వే గార్డులకు పంపిణీ చేసే ట్రాలీ బ్యాగులను రద్దు చేయాలని, అదేవిధంగా కాజీపేట నుంచి విజయవాడకు 35 మంది రైల్వే టీటీల బదిలీలను రద్దు చేయించినట్లు మహ్మద్ ముస్తాక్ హుస్సేన్ తెలిపారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్

గతంలో కాజీపేటలో రైల్వే వ్యాగన్ పీఓహెచ్ వర్క్‌షాప్ ప్రకటన

● తాజాగా అప్‌గ్రేడ్ చేసిన రైల్వే అధికారులు
● ఆర్‌వీఎన్‌ఎల్ కంపెనీకి నిర్మాణ బాధ్యతలు అప్పగింత
● ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల తయారీ
● తాజాగా ప్రకటించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



శరవేగంగా జరుగుతున్న రైల్వే వ్యాగన్ షెడ్ల నిర్మాణ పనులు

తీరిన చిరకాలవాంఛ

కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం నాలుగు దశాబ్దాల కల. దీనికోసం అనేక రైల్వే, ప్రజాసంఘాలు, పార్టీలు పోరాటం చేశాయి. యూనిట్ నిర్మాణంతో కాజీపేట ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాంతంలో నిరుద్యోగం కూడా కొంతమేరకు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం కాజీపేట మండలం మడికొండ శివారులో వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణంలో ఉండగా, కొత్తగా ఎల్‌హెచ్‌బీ, ఈఎంయూ కోచ్‌ల నిర్మాణానికి రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవడంతో జిల్లా ప్రజలు, రైల్వే కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాజీపేట రూరల్: ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న కాజీపేటలో రైల్వే కోచెస్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా అధికారికంగా ప్రకటించారు. కాజీపేట మండలం మడికొండలో నిర్మాణమవుతున్న రైల్వే వ్యాగన్ పీఓహెచ్ వర్క్‌షాప్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వే, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్)లకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని అధికారులు కూడా తెలిపారు. గతంలో ప్రధాని నరేంద్రమోదీ కూడా కాజీపేట పీఓహెచ్ షెడ్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్షరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న వ్యాగన్ షెడ్‌లో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అండ్ మెయింటెనింగ్, మోడ్రన్ రోలింగ్‌స్టాక్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో జర్మనీకి చెందిన లింకే –హమ్‌మన్– బుష్ (ఎల్‌హెచ్‌బీ), ఎలక్ట్రిక్ మల్టీపుల్ యూనిట్ కోచ్ (ఈఎంయూ) తయారు కానున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఇటీవల పట్టాలెక్కిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన కోచ్‌లను కూడా కాజీపేటలో తయారు చేసేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు కపుర్తాలా, చెన్నయ్, రాయ్‌బరేలీలో రైల్వేశాఖ కోచ్‌లను ఉత్పత్తి చేస్తున్నారు. ఇటీవల రైల్వేబోర్డు స్థాయిలో జరిగిన సమావేశంలో కాజీపేటలో రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లు చూడాలని బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. రైల్వే సిటీల అనుసంధానాన్ని పరిగణనలోకి తీసుకుని కోచ్‌ల తయారీకి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కాజీపేటలో వ్యాగన్ పీఓహెచ్ షెడ్‌ను రైల్వే మ్యాన్‌ఫ్యాక్షరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాలు, సదుపాయాలు, ఏరియా తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చకచకా రైల్వే వ్యాగన్‌షెడ్ పనులు..

దాదాపు 50 శాతం పనులు పూర్తి ● 2025 జూన్‌లో ప్రారంభానికి సన్నాహాలు

కాజీపేట రూరల్ : కాజీపేట మండలం మెట్టుగుట్ట వెనుక రైల్వే ట్రాక్ సమీపంలో అయోధ్యపురం –మడికొండ శివారు సరిహద్దులో నిర్మిస్తున్న కాజీపేట రైల్వే వ్యాగన్ పిరాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) షెడ్ పనులు చకచకా జరుగుతున్నాయి. 160 ఎకరాల విస్తీర్ణంలో 2023లో జూలై 8వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌లో వ్యాగన్‌షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వ్యాగన్ పనులు ప్రారంభించి దాదాపు 15 నెలలు కావొస్తుంది. ఇప్పటికే దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయని రైల్వే అధికారులు తెలిపారు. అన్ని విధాలా పూర్తయితే 2025 జూన్‌లో వ్యాగన్ షెడ్‌ను అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం జరుగుతున్న వ్యాగన్ పనుల వివరాలు..

వ్యాగన్ మెయిన్ షెడ్ నిర్మాణం, వివిధ రైల్వే జోన్ల నుంచి గూడ్స్ ద్వారా ఇక్కడికి వచ్చే మెటీరియల్ కోసం స్టోర్ వార్డు నిర్మాణం, వ్యాగన్ షెడ్ నిర్వాహణ కోసం అధికారుల కార్యాలయాలకు సంబంధించిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ నిర్మాణం, కాజీపేట జంక్షన్ నుంచి వ్యాగన్ షెడ్ వరకు ట్రాక్ అనుసంధానం రోడ్ నిర్మాణంతో పాటు వ్యాగన్ షెడ్ ప్రాంగణంలో ఇంకా కావాల్సిన కార్యాలయాలు, వివిధ వ్యాగన్ సెక్షన్ల నిర్మాణం, నిర్వహణ, తదితర కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

శరవేగంగా జరుగుతున్న రైల్వే వ్యాగన్ మెయిన్ షెడ్‌ల నిర్మాణం

వ్యాగన్ పీఓహెచ్ షెడ్ నిర్మాణమైతే కాజీపేట జంక్షన్‌తో పాటు కాజీపేట సమీప ప్రాంతాలు అభివృద్ధితో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుంది. వ్యాగన్ షెడ్‌కు సంబంధించి చిన్న మెటీరియల్‌కు సంబంధించిన పరిశ్రమలు బయట ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

పట్టుదలతో చదివి.. ఉద్యోగం సాధించి

● అగ్రికల్చర్ ఆఫీసర్‌గా బొల్లెపల్లి శ్రీజ
● చిన్నతనంలోనే తల్లిదండ్రుల మృతి
● స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదువు
● రైతుల ఆదాయం పెంచడంతో పాటు సహజసిద్ధ పంటలకు ప్రాధాన్యం



ఏఓగా నియామక పత్రాన్ని చూపుతున్న బొల్లెపల్లి శ్రీజ

ఐనవోలు: అభంశుభం తెలియని పన్నెండేళ్ల పసివయసులో తల్లిదండ్రులు ఒకరి తర్వాత మరొకరు చనిపోయారు. తనకు తోడు చెల్లెలు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. తండ్రి తోడబుట్టిన ఇద్దరు అన్నదమ్ములు (బాబాయ్‌లు) ఉన్నప్పటికీ వారికి భారం కాకూడదనుకుంది. స్వయం కృషితో ఎదగాలని పన్నెండేళ్ల పసితనంలోనే స్థిరమైన నిర్ణయం తీసుకుంది. చెల్లెలితో కలిసి స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదువుకుంది. అన్నింటిలోనూ మెరుగైన ప్రతిభ కనబర్చి ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. ఐనవోలుకు చెందిన బొల్లేపల్లి లక్ష్మి, వెంకటేశ్‌లకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీజ, ఉషలు. శ్రీజకు 12 సంవత్సరాల వయస్సులోనే తల్లిదండ్రులు ఒకరితరువాత ఒకరు చనిపోయారు. దీంతో ఇద్దరు పిల్లలు ఒంటరయ్యారు. ఒకరికి భారం కాకూడదని శ్రీజ తన చెల్లిని తీసుకుని బొల్లికుంట వద్ద గల డాన్ బోస్కో స్కూల్‌లో నర్స్‌ల సంరక్షణలో పదవ తరగతి వరకు చదువుకుంది. బాల వికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇంటర్ పూర్తి చేసింది. మెడిసిన్ చేయాలని టార్గెట్ పెట్టుకుంది కానీ, ఇంటర్ తర్వాత మనసు మార్చుకుని దేశానికి పట్టుకొమ్మలు రైతులేనని.. వారికి ఏదైనా సేవచేయాలని సంకల్పించుకుంది. దీంతో వెంటనే బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటు పొందడానికి లాంగ్ టర్మ్ చేయాలనుకుంది. ఆమె ప్రతిభను గుర్తించిన గాదె ఇన్నయ్య, పుష్పరాణిలు వారి ఆధ్వర్యంలో నడుస్తున్న మా ఇల్లు ఆశ్రమం ద్వారా ఆర్థిక సహకారం అందించారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటుపొంది డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడగా హనుమకొండలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో ఆరునెలలు కష్టపడి పోటీ పరీక్ష రాసి ఏఓ పోస్టులకుగాను మల్టీ జోన్ 1లో 22వ ర్యాంకు సాధించి ఓవరాల్‌గా 40వ ర్యాంకు సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అగ్రికల్చర్ ఆఫీసర్‌గా నియామక ఉత్తర్వులు అందుకుంది.

రైతుల ఆదాయం పెంచడానికి కృషి

రైతుల ఆదాయాన్ని పెంచడానికి కృషిచేస్తానని ఏఓగా నియాయక ఉత్తర్వులు అందుకున్న శ్రీజ తెలిపారు. సహజ సిద్ధంగా పంటలు పండించే పద్ధతులను ప్రోత్సహిస్తానన్నారు. తనకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిన బాలవికాస స్వచ్ఛంద సంస్థ, మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకులు, పెద్దనాన్న, చిన్నాన్న కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనలాగే చెల్లి ఉషా కూడా ప్రస్తుతం మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకుల సహకారంతో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నట్లు శ్రీజ తెలిపింది. ఒంటరి మహిళలు ధైర్యంగా ఇండిపెండెంట్‌గా ఎదగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

'బతుకమ్మ చీరలెక్కడ సీఎం గారు'

● ముఖ్యమంత్రి రేవంత్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్న



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

కురవి: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఆడపడుచులు ఆనందంగా తొమ్మిది రోజులు ఆడుకునే బతుకమ్మ పండుగకు సీఎం రేవంత్ రెడ్డి చీరలు పంపలేదని, ఆ చీరలెక్కడని? పండుగకు ఇస్తానన్నా రూ.ఐదు వందలు ఏవని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం కురవిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడపడుచులకు బతుకమ్మను సంబురంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పండుగకు ముందే చీరలు అందజేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు పండుగ అయిపోతోందని, ఇప్పటి వరకూ సీఎం రేవంత్‌రెడ్డి చీరలు పంపిణీ చేయలేదని, రూ.ఐదు వందలు అడ్రస్ లేకుండా పోయాయని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారని, ప్రభుత్వం సమీక్షత గురుకులాలను గిరిజన జిల్లాకు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలు, గిరిజన మంత్రి సీతక్క ఉన్నప్పటికీ జిల్లాకు గురుకులాలు మంజూరు చేయించకపోవడం వారికి ఈ ప్రాంత అభివృద్ధిపై ఉన్న నిబద్ధత అర్థమవుతోందన్నారు. మంత్రి కొండా సురేఖ చౌకబారు మాటలు ఆమె సంస్కారాన్ని చూపుతున్నాయని వివరించారు. సమావేశంలో నాయకులు ఐలి నరహరి, మన్యూ ప్యాట్నీ, బోడ శ్రీను, నూతక్కి నర్సింహారావు, గుండెబోయిన సూరయ్య, అర్జున్ చౌహాన్, కల్లెపు శ్రీనివాస్, భద్రునాయక్, నెహ్రూనాయక్, కిషన్ నాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

మాటల్లో దింపి మాయ చేశారు..

● 35 తులాల బంగారం కొట్టేశారు
● బస్సులో ప్రయాణిస్తూ చేతి వాటం ప్రదర్శించిన ఇద్దరు మహిళలు
● రంగంలోకి పోలీసు బృందాలు

జనగామ : సస్పెన్స్ సినిమాను తలపించే చోరీ.. ఆర్టీసీ బస్సులో మహిళను మాటల్లోకి దింపి చేతి బ్యాగులో ఉన్న లక్షల విలువైన బంగారు ఆభరణాల ప్యాకెట్‌ను మాయం చేశారు. ఈ ఘటన జనగామలో వెలుగు చూసింది. సీఐ దామోదర్‌రెడ్డి కథనం ప్రకారం.. జనగామ పట్టణం గణేశ్ స్ట్రీట్‌కు చెందిన చొల్లేటి నివేదిత హనుమకొండ న్యూశాయంపేటలోని సోదరి ఇంటికి వెళ్లింది. ఈ నెల 5వ తేదీన సాయంత్రం జనగామకు వచ్చేందుకు హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఉప్పల్‌కు వెళ్లే బస్సు ఎక్కగా.. జనగామలో స్టాప్ లేదని కండక్టర్ చెప్పడంతో సుబేదారి వద్ద దిగింది. అనంతరం ఉప్పల్ వయా జనగామకు వచ్చే మరో బస్సు ఎక్కింది. ఈ క్రమంలో కాజీపేటలో ఇద్దరు మహిళలు అదే బస్సు ఎక్కగా.... అందులో ఓ లేడీ పక్కనే ఉన్న సీటులో కూర్చోగా.. మరో మహిళ నిలబడి ఉంది. నివేదిత తన బ్యాగును కాళ్లపై పెట్టుకోగా, సదరు అనుమానిత మహిళ దానిని బలవంతంగా తీసుకుని పక్కన పెట్టుకుంది. బ్యాగులో 35 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో బాధిత మహిళ నివేదిత తన బ్యాగు తీసుకుని జనగామ బస్టాండ్‌లో బస్సు దిగి ఇంటికెళ్లింది. కొద్ది సమయం తర్వాత బ్యాగు తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు ఉన్న ప్యాకెట్ కనిపించలేదు. దీంతో లబోదిమంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సోమవారం చేసింది. దీంతో సీసీ ఫుటేజీ పరిశీలనతో పాటు హైదరాబాద్, అనుమానిత ప్రాంతాలపై పోలీసులు నిఘా ఉంచారు.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు

వరంగల్ లీగల్ : హనుమకొండలోని గణేశ్‌నగర్‌లో ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలకు ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ హనుమకొండ సెషన్స్ కోర్టు జడ్జి క్షేమ దేశ్‌పాండే సోమవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. 2014 సెప్టెంబర్‌లో హనుమకొండ గణేశ్‌నగర్‌లో సమ్మయ్య(లెక్చరర్) అనే వ్యక్తి ఇంట్లోకి ఆరుగురు వ్యక్తులు చొరబడి భయభ్రాంతులకు గురిచేసి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు హనుమకొండ పీఎస్‌లో కేసు చేసిన అప్పటి ఇన్‌స్పెక్టర్ కిరణ్ కేసు దర్యాప్తు చేసి గోదావరిఖనికి చెందిన నిందితులు ఎస్‌కే అలీ హైదర్, రాదండీ శంకర్, మునీపెద్ది మధుకర్‌ను అరెస్టు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి ముగ్గురు నిందితులు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులను కానిస్టేబుల్ సురేశ్, సుభాశ్ కోర్టులో హాజరుపర్చారు.

ఎల్లలు దాటినా మరవని సంస్కృతి..

అమెరికాలో బతుకమ్మ సంబురాల్లో జనగామకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు



జనగామ: సప్త సముద్రాలు దాటినా మన సంస్కృతిని మరచి పోలేదు. ఉద్యోగ రీత్యా పాశ్చాత్య దేశాలకు వెళ్లి స్థిరపడినా.. తెలుగు పండుగలను ఘనంగా జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నా రు జనగామకు చెందిన ఎన్‌ఆర్‌ఐ కుటుంబాలు. రేణుకుంట కల్ప నాసుమన్ తోపాటు వందలాది కు టుంబాలు అమెరికా కొలంబస్ ఇండియానాలో బతుకమ్మను ఘ నంగా జరుపుకుంటున్నారు. తీరొ క్క పూలతో బతుకమ్మను పేర్చిన అనంతరం ఆడుతూ తెలుగు సంస్కృతిని చాటుతున్నారు.



బతుకమ్మ ఉత్సవాల్లో ఎన్‌ఆర్‌ఐ మహిళలు

జేఎన్‌ఎస్‌లో క్రీడా పండుగ..



400 మీటర్ల పోటీలో పరుగెత్తుతున్న బాలికలు



800 మీటర్ల పోటీలో పరుగెత్తుతున్న బాలురు

ఉత్సాహంగా ప్రారంభమైన అథ్లెటిక్స్ పోటీలు

● రెండు రోజుల పాటు నిర్వహణ
● హాజరుకానున్న సుమారు వెయ్యి మంది క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం 10వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ పోటీలకు సాట్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో సుమారు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కాగా, ఇటీవల చెన్నైలో జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 800 మీటర్ల పరుగులో వెండి పతకం సాధించిన వినోద్‌కుమార్, 3కే మీటర్ల పరుగులో వెండి పతకం సాధించిన మోహిత్‌చౌదరికి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.15వేల నగదు ప్రోత్సాహం అందజేశారు.



జావలిన్‌త్రోలో పాల్గొన్న క్రీడాకారిణి

వైద్యం వికటించి మహిళ మృతి

● మృతురాలి కుమారుడి ఆరోపణ
● ఆర్‌ఎంపీపై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు



రత్నకుమారి (ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఆర్‌ఎంపీ వైద్యం వికటించడంతో మండలంలోని ఊరట్టం కాలనీ(కొత్తూరు) గ్రామానికి చెందిన అసిస్టెంట్ బ్రాంచీ పోస్టు మాస్టర్ కుర్రి రత్నకుమారి(45) ఆదివారం రాత్రి మృతి చెందిందని మృతురాలి కుమారుడు భాస్కర్ ఆరోపించారు. భాస్కర్ కథనం ప్రకారం.. రత్నకుమారికి ఇటీవల జ్వరం రావడంతో ఆదివారం నార్లాపూర్‌లోని ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్ వద్దకు తీసుకెళ్లారు. గ్లూకోజ్ ఎక్కించి ఇంజెక్షన్లు వేయడంతో ఆరోగ్య పరిస్థితి విషమించగా ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. 108లో తరలిస్తుండగా మార్గమధ్యలో రత్నకుమారి మృతి చెందింది. ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్ వైద్యం వికటించడంతోనే తన తల్లి రత్నకుమారి మృతి చెందిందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ సోమవారం డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్యకు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఆర్‌ఎంపీ రాజ్‌కుమార్‌ను వివరణగా రత్నకుమారికి పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ వచ్చిందని, రక్తకణాలు తగ్గిపోయాయని చెప్పి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పానన్నారు. అయితే ఆమె కుమారుడు డబ్బులు లేవు ఇక్కడే వైద్యం చేయమని కోరగా గ్లూకోజ్ పెట్టానన్నారు. చలిరావడంతో విరుగుడు ఇంజెక్షన్ వేసి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించానని తెలిపారు. వైద్యం వికటించి మృతి చెందిందని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి



వర్షిత(ఫైల్)

ములుగు రూరల్: విషజ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పత్తిపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాటోత్ కవిత, జయపాల్ దంపతుల కుమార్తె వర్షిత(08) నాలుగో తరగతి చదువుతుంది. వారం రోజుల నుంచి వర్షితకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు ములుగులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందించారు. మూడు రోజుల పాటు వైద్యం పొందింది. చిన్నారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించాక సదరు ఆస్పత్రి వైద్యుడు హనుమకొండకు తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న క్రమంలో ఆది వారం రాత్రి మృతి చెందింది. చిన్నారి వైద్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరారు.

పోలీసుల పేరిట బెదిరింపులు..

● యువకులను చితకబాది డబ్బులు వసూలు
● ఇద్దరి యువకుల అరెస్ట్, రిమాండ్
● వివరాలు వెల్లడించిన ఏసీపీ పార్థసారథి



మాట్లాడుతున్న ఏసీపీ, పక్కన సీఐ దామోదర్ రెడ్డి

జనగామ : క్రైం బ్రాంచ్ పోలీసుల పేరు చెప్పి.. శుభకార్యానికి వెళ్తున్న యువకులను ఇద్దరు యువకులు అడ్డగించి వారి వద్ద నుంచి డబ్బులు లాక్కెళ్లారని ఏసీపీ పార్థసారథి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన దేవరుప్పుల మండలం గొల్లపల్లికి చెందిన బట్ట నితిన్, తన స్నేహితులు జనగామ మండలం నిడిగొండలో జరిగిన ఫంక్షన్‌కు హాజరై అర్ధరాత్రి 12 గంటలకు తిరిగి బయలుదేరారు. ఇదే సమయంలో యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన కాముని వినయ్, యామంకి మధు క్రైం బ్రాంచ్ పోలీసుల పేరు చెబుతూ ఫంక్షన్‌కు వచ్చి వెళ్తున్న యువకులను చితకబాదారు. వారి నుంచి రూ.ఐదు వందల నగదు, ఫోన్ నుంచి మరో ఎనిమిది వందలు తీసుకుని పరారయ్యారు. బాధితుడు నితిన్ ఫిర్యాదు మేరకు సదరు యువకులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు, ఒక బైక్, రెండు మొబైళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. పట్టణ, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్సై రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి 'మొక్క ముడుపు'నకు తరలిరావాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని నార్లాపూర్ క్రాస్ వద్ద పూజారుల సమక్షంలో నేడు(మంగళవారం నిర్వహించనున్న మొక్క ముడుపు పండుగకు మేడారం జీపీ పరిధిలోని గ్రామస్తులు తరలిరావాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు కోరారు. ఈ మేరకు సోమవారం మేడారం వనదేవతల ప్రధాన ద్వారం ఎదుట పండుగకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'వనదేవతలకు మాటిద్దాం–మొక్క ముడుపు చెల్లిద్దాం' అనే నినాదంతో వినూత్న కార్యక్రమానికి మేడారం పూజారుల సమక్షంలో మేడారం ఆది వాసీ యువకులు శ్రీకారం చుట్టారన్నారు. అడవి పునరుద్ధరణ, ప్లాస్టిక్ వినియోగ నివారణకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ ప్లాంటేషన్ ఫెస్టివల్ నిర్వాహకులు అనిల్‌కుమార్, సుధీర్‌కుమార్, రమేశ్, రమేశ్, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన భోజారావు, కుర్సం రవికుమార్ పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అందించరూ!

● పేగు క్యాన్సర్ వ్యాధితో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి
● చికిత్స కోసం స్థోమతకు మించి అప్పు చేసిన కుటుంబీకులు
● ఇంకా ఖర్చు అవుతుందని చెప్పిన వైద్యులు
● ఆర్థిక సాయం కోసం నిరుపేద కుటుంబం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న కమలాకర్



రాయపర్తి: అసలే నిరుపేద కుటుంబం. అందులో మాయదారి రోగం వెంటాడుతోంది. స్థోమతకు మించి అప్పులు చేసి ఖర్చు చేసినా ఆ వ్యక్తి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దీంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన గారె కమలాకర్ 2008లో హైదరాబాద్‌కు చెందిన మేరీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హైదరాబాద్‌లోనే సెల్‌టవర్లలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కమలాకర్ ఐదు సంవత్సరాల క్రితం పేగు క్యాన్సర్ వ్యాధికి గురయ్యాడు. చికిత్స పొందగా కొంత మేరకు తగ్గుతూ వచ్చింది. ఇటీవల వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం చికిత్సకు రోజుకు రూ.50 వేల ఖర్చవుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో తాహతుకు మించి రూ.15 లక్షల వరకు అప్పులు చేసి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చేతిలో చిల్లగవ్వ లేదు. దీంతో దాతల సాయం కోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. మనసున్న మహారాజులు స్పందించి ఆపన్న హస్తం అందించాలని వేడుకుంటున్నారు. దాతలు **8985129133** నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా సాయం అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.